తేది : 21-10-2016

పత్రికా ప్రకటన

# క్రీడా ప్రియునికి కొత్త కిరీటం

## - భారత హాకీ సమాఖ్య జాతీయ అధ్యక్షునిగా రేవంత్ రెడ్డి
## - అధికారికంగా ప్రకటించిన సెక్రటరీ జనరల్ అశోక్ మాథుర్

హైదరాబాద్, అక్టోబర్ 21 :- తెలంగాణ రాజకీయాలలో ఫైర్ బ్రాండ్ నేతగా ప్రసిద్ధి చెందిన రేవంత్ రెడ్డికి దేశ క్రీడారంగంలో ప్రతిష్ఠాత్మక స్థానం దక్కింది. ఇండియన్ హాకీ ఫెడరేషన్ (ఐహెచ్ఎఫ్- భారత హాకీ సమాఖ్య) జాతీయ అధ్యక్షునిగా రేవంత్ ఎంపికయ్యారని ఐహెచ్ఎఫ్ సెక్రటరీ జనరల్ అశోక్ మాథుర్ ప్రకటించారు.

సుదీర్ఘమైన క్రీడా చరిత్ర కలిగిన ఇండియన్ హాకీ ఫెడరేషన్ 1928 నుంచి భారత దేశంలో హాకీ క్రీడను ప్రోత్సహిస్తోంది. ఈ ఫెడరేషన్‌కు పలువురు ప్రముఖులు ఇప్పటి వరకు జాతీయ అధ్యక్షులుగా పనిచేశారు. పంజాబ్ మాజీ డీజీపీ కె.పి.ఎస్.గిల్ గతంలో ఈ హాకీ ఫెడరేషన్‌కు 14 సంవత్సరాల పాటు జాతీయ అధ్యక్షునిగా పనిచేశారు. ఆయన తరువాత తెలుగు రాష్ట్రాలకు చెందిన మాజీ డీజీపీ దినేష్‌రెడ్డి కూడా గతంలో కొంత కాలం ఈ ఫెడరేషన్‌కు జాతీయ అధ్యక్షునిగా కొనసాగారు. ఆయన తరువాత కె.వి.సింగ్ అనే వ్యాపార ప్రముఖుడు హాకీ ఫెడరేషన్‌కు అధ్యక్షునిగా ఉండగా రేవంత్ రెడ్డి జాతీయ ఉపాధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలోనే కె.వి.సింగ్ పనితీరుపట్ల ఐహెచ్ఎఫ్ కార్యవర్గం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. హాకీ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టడంలో సింగ్ విఫలమయ్యారని భావించిన ఐహెచ్ఎఫ్ కార్యవర్గం ఎట్టకేలకు సింగ్‌ను జాతీయ అధ్యక్షుని స్థానం నుంచి తప్పించాలని నిర్ణయించింది. ఈ పరిస్థితుల్లోనే దేశరాజధానిలో గురువారం ఐహెచ్ఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించామని, అందరి ఆమోదంతో కె.వి.సింగ్‌ను జాతీయ అధ్యక్ష స్థానం నుంచి తప్పించామని ఈ సందర్భంగా మాథుర్ తెలిపారు. భారత హాకీ సమాఖ్యకు పాలకవర్గాన్ని ఎన్నికల ద్వారా ఎంపిక చేయాల్సి ఉంటుందని చెప్పారు. అయితే హాకీ సమాఖ్య చట్టాల

ఎన్.టి.ఆర్. భవన్
రోడ్‌నెం.2, బంజారా హిల్స్
హైదరాబాద్ - 34

ప్రకారంగా అధ్యక్షుడిని ఆ స్థానం నుంచి తప్పించినప్పుడు అతని స్థానంలో సీనియర్ ఉపాధ్యక్షుడు అధ్యక్షుడిగా ఎంపిక అవుతారని తెలిపారు. దీని ప్రకారంగానే కె.వి. సింగ్ ను ఆ స్థానం నుంచి తొలగించడంతో అతని స్థానంలోకి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అయిన రేవంత్ రెడ్డి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని ఆయన వివరించారు. అయితే ఏడాది కాలం తరువాత మళ్లీ ఎన్నికలను నిర్వహించి పూర్తి స్థాయిలో కొత్త పాలక వర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని వెల్లడించారు. రేవంత్ నేతృత్వంలో హాకీ సమాఖ్య మరింత అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నట్లు మాథుర్ పేర్కొన్నారు.

**క్రీడలంటే ఎంతో మక్కువ..**

కాగా ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఫైర్ బ్రాండ్ రాజకీయ నేతగానే పరిచయమున్న రేవంత్ రెడ్డి క్రీడాభిమాని అనే విషయం చాలా మందికి తెలియదు. మహబూబ్‌నగర్ జిల్లా ఒంగూరు మండలం, కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన అనుముల రేవంత్‌రెడ్డి పాఠశాల, జూనియర్ కళాశాల విద్యాభ్యాసాన్ని ప్రస్తుత వనపర్తి జిల్లా కేంద్రంలో పూర్తి చేశారు. వనపర్తిలో చదువుకుంటున్న సమయంలోనే రేవంత్ క్రీడలపట్ల ఎంతో మక్కువను పెంచుకున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా ఇష్టపడే ఖోఖో, కబడ్డీ ఇతర క్రీడలతోపాటుగా ముఖ్యంగా హాకీ, ఫుట్‌బాల్ క్రీడలను ఎంతో ఇష్టంగా ఆడేవారని ఆయన స్నేహితులు చెబుతున్నారు. హాకీలో నైపుణ్యం కలిగిన రేవంత్ 1982-86 మధ్య కాలంలో పాఠశాల, కళాశాల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలోనూ పాల్గొన్నారు. ప్రస్తుతం ఆయన తెలంగాణ హాకీ అసోసియేషన్ అధ్యక్షునిగా కూడా ఎంపికయ్యారు. ఐహెచ్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షునిగా కూడా రేవంత్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. క్రీడలు శారీరక బలానికేకాకుండా మానసిక వికాసానికి కూడా తోడ్పడతాయని, క్రీడాస్ఫూర్తి చాలా గొప్పదని విశ్వసించే రేవంత్ రాజకీయ నేతగా ఊపిరిసలపని పనిఒత్తిడితో ఉన్నప్పటికీ దాదాపుగా ప్రతిరోజు ఫుట్‌బాల్ ఆడతారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించడంలోనూ ఆయన ముందుంటారు. ప్రస్తుతం రేవంత్ ఐహెచ్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు కావడంతో హాకీ క్రీడకు పూర్వ వైభవం వస్తుందని, ప్రత్యేకించి ఉభయ తెలుగు రాష్ట్రాలలో హాకీ అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని తెలంగాణ హాకీ అసోసియేషన్ మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ హాకీ

అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి. అరుణ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. గతంలో జరిగిన రాజకీయ పరిణామాల కారణంగా హాకీ అనుకున్న స్థాయిలో అభివృద్ధి చెందలేదని, అయితే దీక్షాదక్షతలు కలిగిన రేవంత్ నేతృత్వంలో హాకీకి మళ్లీ పునర్వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయ హాకీ సమాఖ్యకు అధ్యక్షునిగా ఎంపికైన రేవంత్‌కు రాజకీయాలకు అతీతంగా పలువురు నేతలు, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు అభినందించారు. హైదరాబాద్ నగరంలో రేవంత్ అభిమానులు పలు కూడళ్లలో బాణా సంచాను కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఐహెచ్‌ఎఫ్ జాతీయ అధ్యక్షునిగా ఎంపికైన రేవంత్‌ను త్వరలోనే ఘనంగా సన్మానించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన అభిమానులు ప్రకటించారు.

**నోట్:-రేవంత్ ఫుట్‌బాల్ ఆడుతున్న ఫోటోలను జతవరచడమైనది గమనించగలరు.**

**( ఎ.రేవంత్‌రెడ్డి)**
వర్కింగ్ ప్రెసిడెంట్
తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్రం

తేది : 21-10-2016

# పత్రికా ప్రకటన

మన తెలంగాణ రాష్ట్రంలో సుమారు 20 లక్షల మందికి పైగా వివిధ రకాల వైకల్యం కలిగిన విభిన్న ప్రతిభావంతులు (వికలాంగులు) ఉన్నారు. అందులో అత్యధిక శాతం పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే! పైగా గ్రామీణ ప్రాంతాలలో నివసించేవారే ఎక్కువ.

తాము అధికారంలోకి వస్తే దివ్యాంగులను సకలాంగులతో సమానంగా బ్రతికేందుకు అవకాశాలు కల్పిస్తామని 2014లో వాగ్ధానం చేసిన టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దివ్యాంగుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. ఈ ప్రభుత్వ పాలనవైఫల్యం వల్ల దివ్యాంగులను చెందాల్సిన 3% రిజర్వేషన్లు సరిగ్గా అమలు కాకపోవడం వారికి విద్య, ఉపాధి కల్పించేందుకు గత ప్రభుత్వాల హయాంలో ఏర్పడ్డ వికలాంగుల సహకార సంస్థ 1985లో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ డా॥ ఎన్.టి.రామారావుగారు వికలాంగుల సంక్షేమవాధులను ఈ ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖలో విలీనం చేయాలని ప్రయత్నాలు చేయడం దివ్యాంగుల ఉనికిని, విశ్వాసాన్ని దెబ్బతీసే చర్య! ఈ చర్యను నిరసిస్తూ వెంటనే ఈ ప్రతిపాధన ఉప సంహరించుకోవాలని డిమాండ్.

రాష్ట్ర ప్రభుత్వంలో ఖాళీలుగా ఉన్న వికాలంగులకు (దివ్యాంగులకు) చెందాల్సిన 2000పైగా బ్యాక్‌లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, నెలకు ఇస్తున్న రూ. 1500 పెన్షన్లు నిబంధనలు సరళతరం చేసే వివాదం లేకుండా వికలాంగులను సకాలంలో అందించాలని, కొత్తగా ఏర్పడ్డ 31 జిల్లాలలో వికలాంగుల విద్యాభివృద్ధికి జిల్లా ప్రధాన కేంద్రాలలో రెసిడెన్షియల్ కళాశాలను, పాఠశాలను ఏర్పరచాలని, రానున్న డిసెంబర్ నెల 3వ తేదీని అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా వికలాంగుల సంక్షేమ వారోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. లేని పక్షంలో తెలుగుదేశం తెలంగాణ తరపున పెద్ద ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నాం.

ఇట్లు

**పి. సాయిబాబు**

మాజీ చైర్మన్

వికలాంగుల సహకార సంస్థ